

ఆంగ్లేయులపై తిరగబడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడి వర్ధంతి సభను నేడు కడపలో నిర్వహించనున్నారు. - 8లో



రోగులకు మెరుగైన సేవలు

ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ, ఐసీటీసీ, టీబీ తదితర విభాగాల్లో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని ఏపీ శాక్స్ జేడీ సుబ్రహ్మణ్యం అన్నారు. - 8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 186 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	628	650
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 192.96 కిలోలు

చిగురిస్తున్న ఆశలు!

- జిల్లాలో 37 వేల హెక్టార్లలో మామిడి సాగు
- 2.60 లక్షల మెట్రిక్ టన్నుల కాయలు దిగుబడి
- సీజన్‌తోపాటు ఇప్పుడు కూడా చెట్లకు కనిపిస్తున్న పూత
- మార్చి నుంచి జూన్ వరకు మామిడి మార్కెట్ కళకళ



సాగులో ఉన్న మామిడి

సాక్షి రాయచోటి : మామిడి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. తొలి విడతలో వచ్చిన పూతకు కాయలు కనిపిస్తుండగా.. ప్రస్తుతం రెండో విడతలో కూడా పూత కనిపిస్తుండడంపై ఆశలు కొత్తగా చిగురిస్తున్నాయి. ఎక్కడ చూసినా పూత, పిందెతో చెట్లు కనిపిస్తుండడం.. గతేడాది కంటే ఈసారి ధర కూడా బాగానే ఉండే అవకాశాలు ఉండడంతో కొత్త ఆశలు మొలకెత్తాయి. అన్నమయ్య జిల్లాలో సుమారు 37 వేల హెక్టార్ల వరకు మామిడి తోటలు సాగులో ఉన్నాయి. అందులో సరాసరిన 20 వేల హెక్టార్లలో పెద్ద చెట్లు (కాయలు కాచే) ఉండవచ్చని ఉద్యానశాఖ అంచనా వేస్తోంది.

మార్చి నుంచి జూన్ వరకు మార్కెట్‌లో కాయలు

మామిడి పంటకు సంబంధించి కాయలు మార్చి నెల నుంచి అందుబాటులోకి రానున్నాయి. మనకు తొలుత కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి మార్చి నెలలో ఇక్కడి మార్కెట్లకు కాయలు రానున్నాయి. తర్వాత రైల్వేకోడూరుతోపాటు చిత్తూరు జిల్లాకు చెందిన మామిడి పంట మార్కెట్‌ను ముంచెత్తనుంది. ఏప్రిల్ నెలనుంచి జూన్ వరకు అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రాయచోటి, పీలేరు నియోజకవర్గాల్లో పలు మండలాల నుంచి భారీగా మామిడి కాయలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో మామిడికి సంబంధించి బెంగుళూర, బేనీషా, నీలం, ఇమామ్ పసంద్, లాల్ బహార్, ఖాదర్, చెరుకు రసం, మల్లిక, సువర్ణ రేఖ, దసేరి, మల్గూబా తదితర రకాల కాయలను సాగు చేశారు. మార్చి రెండవ వారం నుంచి జూన్ నెలాఖరు వరకు కాయలు ఇక్కడి మార్కెట్లలో కళకళలాడనున్నాయి.

రెండుమార్లు పూత



మామిడి పంటకు సంబంధించి ప్రస్తుతం పూత విరివిగా కనిపిస్తోంది. గత నవంబరు, డిసెంబరు నెలల్లో వచ్చిన పూతకు లేలేత కాయలు కూడా ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ వచ్చిన పూత కూడా నిలబడింది. దిగుబడి కూడా ఈసారి అనుకున్న మేర ఆశాజనకంగా ఉంటుంది. అన్నమయ్య జిల్లాలో ప్రధానంగా నాలుగు నియోజకవర్గాల్లో మామిడి పంట సాగులో ఉంది. జిల్లా వ్యాప్తంగా 37 వేల హెక్టార్లలో పంట సాగులో ఉండగా...సరాసరిన 20 వేల హెక్టార్లలో కాయలు కాసే చెట్లు ఉన్నాయి. ఈసారి దిగుబడి కూడా బాగా వస్తుందని అంచనా వేస్తున్నాం. – రవిచంద్రబాబు, జిల్లా ఉద్యాన అధికారి, అన్నమయ్య జిల్లా



ఒకవైపు కాయలు.. మరోవైపు పూత

అన్నమయ్య జిల్లాలో మామిడి పంటకు సంబంధించి రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు నియోజకవర్గాల్లో పంట విస్తారంగా సాగులో ఉంది. ముందుగా రైల్వేకోడూరు ప్రాంతానికి చెందిన కాయలు మార్కెట్‌కు వస్తాయి. తర్వాత మిగతా ప్రాంతాల్లోని కాయలు కూడా అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో ప్రస్తుతం పిందెలతో కూడిన కాయలు కనిపిస్తుండగా మరోవైపు పూత కూడా ఇప్పుడే విరివిగా కనిపిస్తోంది. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో శీతాకాలంలో పూత విపరీతంగా వచ్చినప్పటికీ శీతల ప్రభావానికి కొంతమేర ముసురుకుంది. అయితే మంచుకు తట్టుకుని నిలబడిన తోటల్లో ప్రస్తుతం కాయలు కూడా కనిపిస్తున్నాయి. ఇదే వరుసలో రెండవ విడతగా పూత కూడా విస్తారంగా రావడంతో ఈసారి కూడా భారీగా మామిడి కాయలు అన్నమయ్య జిల్లా నుంచి మార్కెట్‌కు రానున్నాయి.



ఏప్రిల్‌లోపు ఏకసభ్య కమిషన్ నివేదిక

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో బహిరంగ సమావేశంలో మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ అధికారి

మదనపల్లె : రాష్ట్రంలోని బెంతూ ఒరియా, బోయ, వాల్మీకి కులాలకు చెందిన ప్రజల జీవన, సామాజిక, ఆర్థిక, స్థితిగతులపై అధ్యయనం చేసి ఏప్రిల్‌లోపు రాష్ట్రప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఏకసభ్య కమిషన్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు. అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ ఆధ్వర్యంలో బోయ, వాల్మీకి కమ్యూనిటీని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అధ్యయనం కోసం బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి, బోయ కులాలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ..పూర్వీకుల నుంచి తమకు కులం, ఆస్తి వారసత్వంగా వచ్చినప్పటికీ గతంలో తండ్రులు, తాతలు అనుభవించిన రిజర్వేషన్ రాకపోవడం బాధాకరమన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఎస్సీ,ఎస్టీలుగా పరిగణింపబడుతున్న వాల్మీకి, బోయ కులాలు ఆంధ్రప్రదేశ్‌లో ఏజెన్సీప్రాంతంలో ఎస్టీలుగా గుర్తింపు పొందుతూ, మైదానప్రాంతంలో బీసీలుగా పరిగణించడం ఎంత వరకు భావ్యమన్నారు. అనంతరం ఏపీ గిరిజనసమాఖ్య, గిరిజన ఐక్యవేదిక, అఖిలభారత బంజార సేవాసంఘం ప్రతినిధులు మాట్లాడుతూ..ఎస్టీలకు ప్రస్తుతం అమలవుతున్న ఆరుశాతం రిజర్వేషన్ ఫలాలు పూర్తిస్థాయిలో తమకు అందడం లేదన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎస్టీ కులాలకు రావాల్సిన హక్కులను కల్పించి, రిజర్వేషన్ శాతాన్ని పెంచి ఇతర కులాలను చేర్చినా తమకు అభ్యంతరం లేదన్నారు. ఈ సందర్భంగా శ్యామూల్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. ఏకసభ్య కమిషన్ ఇప్పటికే అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు, శ్రీకాకుళం, కుప్పం జిల్లాల్లో పర్యటించిందన్నారు. మిగిలిన జిల్లాల్లోనూ ఏప్రిల్‌లోపు పర్యటించి, రికార్డు చేసిన వివరాలు, అధ్యయనం చేసిన అంశాలపై సమగ్ర నివేదిక తయారుచేసి రాష్ట్రప్రభుత్వానికి అందిస్తామన్నారు. సమావేశంలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అబుసలామ్, ఏబీసీడబ్ల్యూఓ హరీష్‌బాబు, వార్డెన్ వెంకటేష్, ఎస్‌ఐ హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై ప్రజలు, కార్యకర్తలకు నమ్మకం లేదు

మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి, చిత్రంలో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందని, కార్యకర్తల్లో ధైర్యం సన్నగిల్లిందని మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అపూర్వ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్ పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తమ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపేందుకు 'జగన్‌కు భయం అంటే ఏమిటో చూపిస్తా', 'భయం నా డిక్షనరీలోనే లేదు' వంటి డైలాగులు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయాన్ని చేతల్లో అమలు చేసి చూపిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాయలసీమకు సాగునీరు, తాగునీరు అందించడానికి వైఎస్సార్ జలయజ్ఞం చేపట్టి ప్రాజెక్టులు చేపట్టారని, వైఎస్ జగన్ ఆ ప్రాజెక్టులను పూర్తి చేసి నీటితో నింపారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి తిరుగులేని మెజార్టీ అందించి వైఎస్ జగన్‌కు మళ్లీ పట్టం కడతారన్నారు.

న్యూస్‌రీల్

అండర్ -14 క్రికెట్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక



అండర్ 14 జట్టుకు ఎంపికైన దినేష్, ధనుష్

వాల్మీకిపురం: ఆంధ్ర క్రికెట్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్‌లో జరుగుతున్న క్రికెట్ క్యాంపు నుంచి ఇద్దరు క్రీడాకారులు దినేష్ (ఆఫ్ స్పిన్), ధనుష్(ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్)లు స్కూల్ గేమ్స్ ఆఫ్ చిత్తూరు ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలుర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ సునీల్ కుమార్ తెలిపారు. వీరు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగే ఎస్‌జీఎఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల వీసీసీ అధ్యక్షుడు శ్రీధర్, సీనియర్ క్రీడాకారులు షాహెద్, భరత తదితరులు అభినందించారు.

గంగమ్మ జాతరకు 50 ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డి సర్కిల్: లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో జరుగుతున్న గంగమ్మజాతరకు 50 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ గోపాల్ రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 25 బస్సులు, పులివెందుల డిపో నుంచి 25 బస్సులు మొత్తం 50 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కడప నుంచి రూ. 80, పులివెందుల నుంచి రూ. 130లు చార్జీగా నిర్ణయించామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామయ్య కల్యాణాన్ని సౌకర్యంగా వీక్షించేలా ఏర్పాట్లు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామయ్య బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా ఏప్రిల్ 5న జరగబోయే రామయ్య కల్యాణానికి వచ్చే భక్తులు అన్ని సౌకర్యాలతో వీక్షించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని టీటీడీ ఈఈ సుమతి తెలిపారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా జరుగుతున్న కల్యాణ వేదిక ఏర్పాట్లను మంగళవారం టీటీడీ ఈఈ సుమతి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణం రోజున వేలాదిగా వచ్చే భక్తులకు కావాల్సిన తాగునీరు, అన్నప్రసాదాలు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించామన్నారు.

వీరభద్రస్వామికి విశేష పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం స్వామి వారికి ప్రమధగణ పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి విజయ ఆధ్వర్యంలో వేదపండితులు నందుల పతం శశిభూషణ్ సిద్ధాంతి రుత్వికలు, అర్చకులు, ప్రధాన అర్చకులతో కలసి ఉదయం యాగశాలలో ప్రమధగణ హోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి, అమ్మ వారికి రంగురంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు.

స్వామి సేవలో..

శ్రీ వీరభద్రస్వామిని ఉజ్జయినీ సద్ధర్మ సింహాసనా. దీశ్వర శ్రీ 1008 జగద్గురు సిద్ధలింగరాజ దేశికేంద్ర శివాచార్య భగవత్పాదులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతకు ముందుగా ఆయనను భక్తులు ఎస్ఎన్ కాలనీ నుంచి కలశాలతో అడ్డపల్లకీలో ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆయనకు కుప్పం రెడ్డి శంకర్ కుటుంబ సభ్యులతో పాటు రాయచోటి పట్టణంలోని భక్తులు, కన్నడ భక్తులు ఆయనకు విశేషంగా పూజలు నిర్వహించి మొక్కులు మొక్కారు.

సమర్థవంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలోని అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో బ్యానర్లు, ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి పోస్టర్లు ఉండకూడదని కలెక్టర్ సూచించారు. ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వివిధ పార్టీల అభ్యర్థులు కుల, మత ప్రాంతీయపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజకీయ నేతలు ప్రవర్తించకూడదన్నారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం నిషిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరత రానివ్వకూడదు

జిల్లాలో ఇసుక కొరత రానివ్వకుండా చూడాలని జిల్లాస్థాయి కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో మంగళవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో ఇసుక లభ్యత, వివిధ ఇసుక రీచ్‌లపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో డిమాండ్‌కు అనుగుణంగా కొరత లేకుండా ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్ కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగంపేట, పీలేరు, టంగుటూరు తదితర ఇసుక రీచ్‌లలో సరిపడ ఇసుక అందుబాటులో ఉందని కమిటీ కలెక్టర్‌కు నివేదించింది. గంగాపురం ఇసుక రీచ్‌కు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఆమోదం తెలిపింది. పింఛా జలాశయంలోని పూడికతీత పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలశాఖ అధికారులు సమన్వయంతో రీసర్వేలు నిర్వహించి అనుకూలమైన చోట ఇసుక రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ సూచించారు.

నేడు పొన్నపురెడ్డి నామినేషన్



కడప కార్పొరేషన్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి బుధవారం నామినేషన్ వేయనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల మధ్య ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులైన మేయర్, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో సమావేశం కానున్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి. రామసుబ్బారెడ్డి నామినేషన్ వేస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ పరిశీలకుడు బి. నిత్యానందరెడ్డి పిలుపునిచ్చారు.

దారులన్నీ.. గంగమ్మ జాతర వైపే!

- అంగరంగవైభవంగా ప్రారంభమైన అనంతపురం గంగమ్మ జాతర
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చాందినీ బండ్లు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో అనంతపురం గంగమ్మ దేవత



జాతరకు హాజరైన భారీ భక్తజనం

లక్కిరెడ్డిపల్లె: రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ దేవత జాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. భక్తజనం పోటెత్తారు. గంగమ్మ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గంగమ్మ తల్లీ.. కాపాడవమ్మా అంటూ వేడుకున్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దారులన్నీ అమ్మవారి సన్నిధికే అన్నట్లు వేలాది వాహనాలు జాతర వైపు సాగాయి. సంతానం కోసం మహిళా భక్తులు అమ్మవారికి ఒరపడి ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయంలోని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అమ్మవారికి చాగలగుట్టపల్లెలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగు రంగుల పూలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేయడంతో కొత్త శోభను సంతరించుకుంది.

ప్రత్యేక ఆకర్షణగా చాందీని బండ్లు: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జాతరకు చేరుకోవడంతో చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాదిగా కాలినడకన జాతరకు తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పట్టు వస్త్రాలు సమర్పించిన కడప మేయర్ సురేష్ బాబు

కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

గంగమ్మ ఆలయ ఖ్యాతిని మరింత పెంచుతాం:ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

అనంతపురం గంగమ్మ ఆలయ ఖ్యాతిని మరింత పెంపొందిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయం వెనుక భాగంలో రాజగోపురం, కోనేరు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జాతర విజయవంతానికి కృషి చేస్తున్న ఆలయ కమిటీ దాతలు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంఘాలు, స్థానిక గ్రామాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

బంగారు నగలు చోరీ

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీ – 8లో సోమవారం రాత్రి ఎస్.కంఠయ్య ఇంటిలో రూ. 89 వేల నగదు, 8 తులాలు బంగారు చోరీ జరిగినట్లు హెడ్ కానిస్టేబుల్ రామచంద్రయ్య గౌడ్ మంగళవారం తెలిపారు. కంఠయ్య ఏపీఎండీసీలో పనులకు వెళ్లగా రాత్రి వేళలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపల ఉన్న నగదు, బంగారాన్ని దోచుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

108లో ప్రసవం


బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

వాల్మీకిపురం : గుర్రంకొండ మండలం పాయలవారిపల్లెకు చెందిన బాలాజీ భార్య రేణుక 108లో ప్రసవించింది. ఆమె రెండో కాన్పు కోసం మంగళవారం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి వస్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డకు స్థానిక వైద్యులు ప్రత్యేకంగా వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది వాణి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కంచెకు నిప్పు.. తోటకు ముప్పు

– మామిడి, టేకు చెట్లు దగ్ధం


కాలిపోయిన మామిడి, టేకు చెట్లు

రామాపురం : మండలంలోని చిట్లూ పంచాయతీ దళితవాడకు చెందిన రైతు సగినాల నాగమ్మ, సగినాల వీరనాగయ్యకు సంబంధించిన తోట కంచెకు నిప్పు పెట్టడంతో మామిడి, టేకు చెట్లు కాలిపోయాయి. చిట్లూరు పొలం సర్వే నంబర్ 759లో 6 ఎకరాలలోని మామిడి, టేకు చెట్లు పెంచిన తోట కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పంటించారు. మంటలు వ్యాపించి మోటారు, టేకు, మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగేళ్లుగా పెంచిన చెట్లు కాలిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

ఆంగ్లేయులపై తిరగబడ్డ కడప బిడ్డ

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

- జాతీయోద్యమానికి స్ఫూర్తి
- ప్రథమ స్వాతంత్య్ర యోధునిగా కీర్తి
- ఉరికొయ్యను ముద్దాడి నేటికి 176 ఏళ్లు
- నేడు కడపలో వర్ధంతి సభ



కడప సెవెన్‌రోడ్స్ : భారతీయుల్లో జాతీయ భావం అప్పటికి సరిగా మొగ్గతొడగలేదు. ఆధునిక చరిత్రకారులు ప్రథమ భారత స్వాతంత్య్ర సంగ్రామంగా పేర్కొనే సిపాయిల తిరుగుబాటు జరగలేదు. కానీ అంతకు పదేళ్ల క్రితమే నాటి కడప జిల్లా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన దొరవారి నరసింహారెడ్డి ఆంగ్లేయులపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. నేటికి సరిగ్గా 176 ఏళ్ల క్రితం ఉరికొయ్యను ముద్దాడి ఆయన భావి భారత జాతీయోద్యమానికి స్ఫూర్తిగా, దిక్సూచిగా నిలిచారు.

తిరుగుబాటులో ముఖ్య సంఘటనలు

1846 జూన్‌లో తనకు రావాల్సిన పెన్షన్ కోసం అనుచరులను కోయిలకుంట్ల ట్రెజరీకి పంపగా తహసీల్దార్ రాఘవాచార్యులు తిట్టి పంపడంతో పోరాటానికి తెరలేచింది. జూలై 7 లేదా 8 తేదీల్లో చాగలమర్రి తాలూకా రుద్రవరం గ్రా మాన్ని కొల్లగొట్టుకుపోతుండగా మిట్టపల్లె వద్ద పోలీసులతో పోరాటం జరిగింది. జూలై 10న కోయిలకుంట్ల ట్రెజరీపై రెడ్డి బృందం దాడి జరిపింది. జూలై 23న గిద్దలూరు వద్ద లెఫ్టినెంట్ వాట్సన్, 24న ముండ్లపాడు వద్ద కెప్టెన్ నాట్, కెప్టెన్ రసల్ నాయకత్వంలోని సైన్యంతో పోరాటం సాగింది. అక్టోబరు 6న పేరుసోముల కొండల్లో పట్టుబడ్డారు. 1847 ఫిబ్రవరి 22న సో మవారం ఉదయం 7 గంటలకు కోయిలకుంట్లలో 2000 మంది ప్రజలు చూస్తుండగా కడప కలెక్టర్ కాక్రేన్ సమక్షంలో నరసింహారెడ్డిని ఉరి తీశారు. 1877 వరకు ఆయన తల ఉరి కంభానికి వేలాడుతూనే ఉంచారు.

'సీమ' రైతాంగ పోరాటం

నరసింహారెడ్డి తన పెన్షన్ కోసం తిరుగుబాటు చేశారే తప్ప బ్రిటీషు పాలకులను వెళ్లగొట్టాలన్న లక్ష్యంతో కాదని ఇటీవల సోషల్ మీడియా వేదికల్లో కొందరు వాదించడంలో నిజం లేదని జిల్లాకు చెందిన చరిత్ర పరిశోధకుల అభిప్రాయం. పెన్షన్ కోసమే అయితే సుమారు 9 వేల మంది ప్రజలు తిరుగుబాటులో ఎందుకు పాలుపంచుకున్నారన్న ప్రశ్నకు విమర్శకుల వద్ద సమాధానం లేదు. కరువులు వచ్చి పంటలు పండకపోయినా భూమి శిస్తు వసూలు చేసేవారు. పైగా శిస్తుల భారం అధికంగా ఉండటంతో అనేక గ్రామాల్లో వేలాది ఎకరాల భూములను రైతులు బీళ్లుగా పెట్టాల్సి వచ్చింది. గ్రామ కట్టుబడి బంట్రోతులు అనుభవించుకుంటున్న మాన్యం భూముల వంశపారంపర్య హక్కులు ప్రభుత్వం రద్దు చేసింది. సంతతి లేకుండా మరణించిన కట్టుబడుల భూములను లాగేసుకున్నారు. గ్రామ విధులను సరిగా నిర్వర్తించలేదని కొందరి తవర్జీ తగ్గించారు. బంట్రోతులను బదిలీ చేయడం, గ్రామ పోలీసు వ్యవస్థ పునర్ నిర్మాణానికి ప్రయత్నించారు. ఇవన్నీ కట్టుబడులలో అలజడి కలిగించడంతో నరసింహారెడ్డి వెంట నడిచారు. ఈ కేసు విచారణ చేసిన స్పెషల్ కమిషనర్ ఇంగ్లిస్ స్వయంగా ఈ వివరాలను బోర్డు ఆఫ్ రెవెన్యూకు నివేదించారు. ఈ కారణాల రీత్యా దీన్ని రాయలసీమ రైతాంగం జరిపిన తొలి తిరుగుబాటుగా భావించాలని చరిత్రకారులు అంటున్నారు.

నరసింహారెడ్డి అందరివాడు

జాతీయ నాయకుల మాదిరే నరసింహారెడ్డిని కూడా ఒక సామాజిక వర్గానికి అంటగట్టి మాట్లాడే ధోరణి సరికాదని మేధావుల అభిప్రాయం. నరసింహారెడ్డి గురువుగా భావించే గోసాయి వెంకయ్య ప్రధాన అనుచరులైన కరణం అశ్వర్థామ, జంగం మల్లయ్య, వడ్డె ఓబన్నలతోపాటు చెంచులు, యానాదులు, బోయలు, వడ్డెరలు తిరుగుబాటులో ప్రధానంగా పాల్గొన్నారు. చివరకు బ్రాహ్మణులు సైతం పాల్గొన్నారంటే ఆ తిరుగుబాటుకు ఉన్న ప్రజా పునాది అర్థమవుతుందని మేధావులు స్పష్టం చేస్తున్నారు.

చరిత్రకారుల చిన్నచూపు

సిపాయిల, సన్యాసుల, మోప్లా, చిట్టగాంగ్, రంపా, చీరాల–పేరాల తిరుగుబాట్ల గురించి నాటి చరిత్రకారులు పేర్కొన్నారు. కానీ వాటి కంటే ఎన్నో ఏళ్ల ముందు స్వరూపంలో ఏమాత్రం తీసిపోని నరసింహారెడ్డి తిరుగుబాటు గురించి పట్టించుకోలేదని అంటున్నారు. 1955లో బెంగాలి చరిత్రకారుడు ఎస్‌బీ చౌదరి మాత్రమే తాను రాసిన 'సివిల్ డిస్ట్రబెన్సెస్ డ్యూరింగ్ ద బ్రిటీషు రూల్ ఇన్ ఇండియా (1765–1857)' అనే గ్రంథంలో నరసింహారెడ్డి తిరుగుబాటు గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఆంధ్ర చరిత్రకారులు కనీసం తిరుగుబాటుకు సంబంధించిన కాలక్రమణికను కూడా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

నేడు వర్ధంతి సభ

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభను బుధవారం ఉదయం కడప నగరంలోని రెడ్డి సేవా సమితి కార్యాలయంలో నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా హైస్కూలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– లెక్కల కొండారెడ్డి, రెడ్డి సేవా సమితి, కడప

నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం నరసింహారెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించడం, కర్నూలు ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టడం అభినందనీయం. భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఆయన విగ్రహాన్ని కడపలో ఏర్పాటు చేయాలి.

– కేశవులు నాయుడు, పాలిగార్ వంశీయులు, మాదినేనిపాలెం, గుర్రంకొండ

గల్ఫ్ బాధితులకు అండగా పోలీస్ శాఖ

- పోలీస్ కార్యాలయ ఆవరణలో కాల్ సెంటర్
- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : ఉద్యోగం, కుటుంబ పోషణ నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న బాధితులకు నేనున్నానని....మీకేం కాదని గల్ఫ్ బాధితుల పక్షాన అన్నమయ్య పోలీస్ శాఖ నిలుస్తుందని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు భరోసా ఇచ్చారు. మంగళవారం జిల్లా ఎస్పీ కాన్ఫరెన్సు హాల్‌లో గల్ఫ్ దేశాలలో ఉంటూ ఇబ్బందులకు గురవుతున్న వారి సంరక్షణ, సహాయం కోస్ హెల్ప్ లైన్ నంబరు : 8688830014ను ప్రారంభించిన అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. జిల్లా పరిధిలో అధికంగా జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారని ఇలా వెళ్ళిన వారు ఏజెంట్లు, షేట్‌లు తదితర విధాలుగా మోసాలకు గుర్తై నరకయాతనకు లోనవుతున్నట్లు తమ దృష్టికి వస్తున్నాయన్నారు. అలాంటి వారికి కొంతైనా తోడుగా ఉండి న్యాయం చేయాలన్న సంకల్పంతో పోలీసు యంత్రాంగం సమాయత్తమైందన్నారు. అయితే జీవనోపాధి దృష్ట్యా గల్ఫ్ దేశాలకు వెళ్ళదలచుకున్న వారి సంరక్షణ, ఫిర్యాదుల కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇమిగ్రేషన్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, తద్వారా గల్ఫ్ దేశాలలో ఉంటూ ఇబ్బందులకు గురవుతున్న వారి సంరక్షణ, సహాయం కోసం హెల్ప్‌లైన్ ప్రారంభించామన్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 10 రోజుల క్రిందట ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. గల్ఫ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు సేకరించామన్నారు. ఈ సమస్యలకు కొంతవరకైనా పరిష్కారం చూపడంతోపాటు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ సెల్ ఏర్పాటు చేయడమైందన్నారు. ఎవరైనా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారు హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేసి వారి వివరాలను తెలియపరిస్తే వాటిని నమోదు చేసుకొని వీసా సర్వీసు చేస్తున్న ఏజెంటు పూర్తి వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కావున జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మదనపల్లె రూరల్ కొత్తపల్లె పంచాయతీ శాంతిపురానికి చెందిన రమేష్ కుమార్తె దీపిక(27)కు కొంతకాలం క్రితం ఈస్ట్ కొత్తపేటకు చెందిన ఆనంద్‌తో వివాహమైంది. కొన్ని రోజులుగా అదనపు కట్నం తేవాలని భర్త ఆనంద్, అతని తల్లి మార్తమ్మ వేధింపులకు గురిచేయడంతోపాటు ఇటీవల ఆమెను ఇంట్లో నుంచి తరిమేశారు. దీంతో బాధితురాలు తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త, అతని తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్ల నరికివేతపై..

ప్రభుత్వ స్థలంలో చెట్ల నరికివేతపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మదనపల్లె మండలంలోని పోతబోలు పంచాయతీ ఆరోగ్యవరం సమీపంలో ఎన్‌హెచ్–71 కోసం సేకరించిన ప్రభుత్వ స్థలంలో ఉన్న చెట్లను ఈ ఏడాది జనవరి 14న నిబంధనలకు విరుద్ధంగా నరికివేశారు. దీనిపై స్థానికులు తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేయడంతో ఆయన చెట్లను నరికిన వారిపై మంగళవారం తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

అనీమియా ముక్త్‌భారత్ అమలులో నందలూరు భేష్

అభినందించిన స్టేట్‌ఆర్‌సీహెచ్ మానిటరింగ్ బృందం


రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్యబృందం

నందలూరు(రాజంపేట) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనీమియా ముక్త్‌భారత్ అమలులో నందలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పనితీరును స్టేట్ ఆర్‌సీహెచ్ మానిటరింగ్ అధికారి డాక్టర్ విజయ్ అభినందించారు. ఈయన ఆధ్వర్యంలో వైద్యబృందం జిల్లాలో పదికిపైగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అనీమియా ముక్తిభారత్ కార్యక్రమం అమలుపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అనీమియా ముక్తిభారత్ కార్యక్రమంలో గర్భిణులకు, కౌమరదశ పిల్లలకు ఏఎన్‌ఎంలు చేసిన రక్తపరీక్షలను మళ్లీ పరీక్ష చేశారు. రక్తపరీక్షలను చేసే విధానంపై అవగాహన కల్పించారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సానేశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, లక్షుమయ్య, వైద్యాధికారిణి సృజన, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు

ఏపీ శాక్స్ జేడీ సుబ్రహ్మణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ శాక్స్ జేడీ సుబ్రహ్మణ్యం

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ, ఐసీటీసీ, టీబీ తదితర విభాగాల్లో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ, రక్తనిధి, క్షయ, ఐసీటీసీ విభాగాలను పరిశీలించారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యసిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్‌టీ కేంద్రంలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు త్వరలోనే నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ దివాకర్, డాక్టర్ అమరావతి, డీపీఎం రెడ్డెప్ప, వేణుగోపాల్, శ్రీనివాసులు, టీబీ సిబ్బంది ప్రభాకర్, జయకుమార్, పుల్లయ్య, దీప్తి, పురుషోత్తం, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందలూరు రైల్వేకేంద్రంలో ముగిసిన నామినేషన్ల పర్వం

బరిలో యూనియన్, సంఘ్ అభ్యర్థులు

నందలూరు (రాజంపేట): జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం మంగళవారం ముగిసింది. ఈ నెల 23 వరకు ఉపసంహరణ గడువు ఉంది. ఈ నేపథ్యంలో సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్, సౌత్‌సెంట్రల్ ఎంప్లాయీస్ సంఘ్ ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గంలోని కీలక పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు.

మజ్దూర్ యూనియన్ ప్యానెల్ ఇదే..

మజ్దూర్ యూనియన్ ప్యానెల్ కింద సెక్రటరీ స్థానానికి కె.విశ్వనాథ్(స్టేషన్‌మాస్టర్), జాయింట్ సెక్రటరీకి హర్ష (ట్రాక్‌మెయింటెనర్), ట్రెజరర్‌కి మార్తా శ్రీనివాస్ (లోకోపైలెట్), డైరెక్టర్ స్థానాలకు జంగం వంశీకృష్ణ(అసిస్టెంట్‌లోకో పైలెట్), రాజా(ట్రాక్‌మెయింటెన్), టి.బాలసుబ్రమణ్యం(సీనియర్ గూడ్స్ మేనేజరు), నరసింహులు(సీనియర్ టెక్నిషియన్ ,ఓహెచ్‌ఈ), షేక్ మహమ్మద్‌గౌస్(సీనియర్ సీసీఆర్), అబ్దుల్‌రౌఫ్(లోకోపైలెట్) ఉన్నారు.

ఎంప్లాయీస్ సంఘ్ ప్యానెల్..

ఎంప్లాయీస్ సంఘ్ ప్యానెల్ నుంచి సెక్రటరీకి కృష్ణమూర్తి (లోకోపైలెట్), జాయింట్ సెక్రటరీకి పెంచలయ్య(సీఎల్‌ఐ), ట్రెజరర్‌కి ఎం.రాజేశ్వరయ్య (ఎలక్ట్రికల్), డైరెక్టర్లుగా ఎంజీకేఎస్ కిషోర్‌దాస్ (స్టేషన్ సూపరింటెండెంట్), రామకృష్ణ (లోకోపైలెట్), కమాల్‌సింగ్‌మీనా (టెక్నిక్..ఎలక్ట్రికల్), ఎం.వెంకటరమణయ్య (లోకోపైలెట్), పి.శ్రీనివాసులు (లోకోపైలెట్), సుబాష్ (ట్రాక్‌మెయింటనర్) ఉన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత ముక్కవారిపల్లె జట్టు


విజేత జట్టుకు చెక్కు, ట్రోఫీని అందజేస్తున్న ముక్కా సాయివికాష్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రాయలసీమ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా ముక్కవారిపల్లి జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. 27 జట్లతో దాదాపు నెలరోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు మంగళవారం చలంపాలెం క్రీడా మైదానంలో నిర్వహించారు. ముక్కవారిపల్లి–11, వైకోట–11 జట్ల మధ్య ఫైనల్ పోటీలు నిర్వహించారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించడం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాష్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. విజేతలకు రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా మొదటి బహుమతి రూ. 1.50 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు చెక్కు ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు రైల్వేబోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సిపి నాయకులు బత్తిన వేణుగోఉపాల్‌రెడ్డి, తల్లెం చంద్రమోహన్ రెడ్డి, గజ్జల శ్రీనివాసులురెడ్డి, కొలూరు సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర ఎస్టీయూ నాయకులు గడ్డం ఆదినారాయణరెడ్డి, హెడ్ మాస్టర్ రమణయ్య, ఉపాధ్యాయులు నంద్యాల రవికుమార్, పి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎఫ్‌బీఓకు తీవ్ర గాయాలు

సిద్దవటం : ద్విచక్ర వాహనంలో విధులకు వెలుతున్న సిద్దవటం బీటుకు చెందిన ఫారెస్టు బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, ఏబీఓ హైమాతికి స్వల్ప గాయాలైయ్యాయి. సిద్దవటం రేంజిలో పని చేస్తున్న సిద్దవటం భీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంటు బీటు అధికారి హైమావతిలు ద్విచక్ర వాహనంలో మంగళవారం ఉదయం విధులకు వెలుతుండగా కమ్మపాల్లెం గ్రామ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద బర్రెలు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తీవ్రగా గాయపడిన రాజశేఖర్‌రెడ్డికి సిద్దవటం ప్రభుత్వం ఆసుపత్రిలోని వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌సుపత్రికి తరలించారు. అసిస్టెటు బీటు అధికారి హైమాతికి స్వల్పగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లారు. సిద్దవటం రేంజర్ ప్రసాద్, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు గాయపడిన వారిని పరామర్శించారు.

స్వగ్రామానికి వెళుతుండగా..

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. మండలంలోని వలసపల్లె పంచాయతీ నాయునివారిపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి(46) ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. తిరుగుప్రయాణంలో స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో వలసపల్లె జ్యూస్‌ఫ్యాక్టరీ వద్ద బొలేరో వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి..

బైక్ అదుపుతప్పి ఇద్దరు గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన యుగంధర్(20), హరి(22) ద్విచక్రవాహనంలో వారపుసంతకు వెళ్లి సరుకులు తీసుకుని ఇంటికి వస్తుండగా బైక్ అదుపుతప్పి పడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దాడిలో గాయపడిన వృద్ధుడి మృతి

హత్య కేసుగా నమోదు


వై.శంకర్‌నాయుడు(ఫైల్)

ములకలచెరువు : దాడిలో గాయపడిన ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బురకాయలకోట పంచాయతీ యర్రమాసివారిపల్లెకు చెందిన వై.శంకర్‌నాయుడు(58)పై అదే గ్రామానికి చెందిన సమీప బంధువు వై.శ్రీనివాసులు ఇటీవల దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న మదనపల్లి డీఎస్పీ కేశప్ప, సీఐ సాదిక్ అలీ మంగళవారం మృతుడి నివాసం చేరుకొని విచారణ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. వై.శ్రీనివాసులు, వై.శంకర్‌నాయుడు మధ్య గతంలో నగదు లావాదేవీలు ఉండేవని చెప్పారు. ఈ క్రమంలో శ్రీనివాసులు భార్యతో వై.శంకర్‌నాయుడు వివాహేతర సంబంధం పెట్టుకున్నారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసులు, కుమారుడు వెంకటేష్‌లు శంకర్ నాయుడుతో గొడవ పడ్డారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చితకబాదారు. నొప్పులతో పడివున్న శంకర్‌నాయుడును పక్కింటి వాళ్లు గమనించి భార్య ధనమ్మకు సమాచారం అందించారు. ధనమ్మ పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు విచారణ చేపట్టి అప్పట్లో వై.శ్రీనివాసులు, కుమారుడు వై.వెంకటేష్ పైన కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వారిద్దరిపై హత్య కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రాణం తీసిన అతివేగం

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి


నితిన్ (ఫైల్)

కలికిరి : అతి వేగం ఓ యువకుని ప్రాణాన్ని బలిగొన్న ఘటన సోమవారం రాత్రి కలికిరి పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కలికిరి గ్రామ పంచాయతీ కొత్తపల్లికి చెందిన మోహన్ కుమారుడు నితిన్(18) బెంగళూరులో చదువుతున్నాడు. మంగళవారం బెంగళూరుకు వెళ్లాల్సి ఉన్న క్రమంలో.. సోమవారం కొత్తపల్లి నుంచి తన ద్విచక్ర వాహనంలో కలికిరికి సినిమాకు బయలుదేరాడు. మార్గమధ్యలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు డివైడర్ వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కాగా ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేరుకుని నితిన్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ రషీద్ మృతి

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ షేక్ అబ్దుల్ రషీద్ (80) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. వయోభారంతో కొద్ది కాలంగా ఇంటికే పరిమితమైన ఆయన పరిస్థితి విషమించి మరణించారు. దాదాపు 60 ఏళ్లుగా జిల్లాలో సీనియర్, ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా అటు పాత్రికేయ రంగానికి, ఇటు రాజకీయ రంగానికి సుపరిచితులు. రాయల్ ఫొ టో స్టూడియో స్థాపించి ప్రజలకు సేవలు అందించారు. పాతతరం ఫొటోల కోసం రాయలసీమ వ్యా ప్తంగా అందరూ ఆయననే సంప్రదించేవారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, ఆర్టీఓ ధర్మచంద్రారెడ్డి, పలువురు పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు, ప్రజాప్రతినిధులు వెళ్లి అబ్దుల్ రషీద్ మృతదేహాన్ని దర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు.